సోమవారం | తెలంగాణ
27 ఏప్రిల్ 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

వరంగల్‌కు జాతీయ స్థాయిలో
ప్రతిష్టాత్మక గుర్తింపు
పద్మ శ్రీ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు 2026 అందుకున్న జర్నలిస్ట్ రాంపెల్లి లింగమూర్తి.

నల్లబెల్లి, ఏప్రిల్ 26 (నినాదం): డిజిటల్ మీడియా జర్నలిజం రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన వరంగల్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ రాంపెల్లి లింగమూర్తి కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన "పద్మ శ్రీ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు--2026" ప్రదానం చేయడం జరిగింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్‌లో జివ్రాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యక్తులను సత్కరించారు.మీడియా రంగంలో రాంపెల్లి లింగమూర్తి చూపించిన కృషి, ప్రజా సమస్యలపై లోతైన అవగాహన కల్పించడం, నిష్పక్షపాత ధోరణితో వార్తలను ప్రజల ముందుకు తీసుకురావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడం ద్వారా ఆయన విశ్వసనీయ జర్నలిస్ట్‌గా పేరు సంపాదించారు. ఎంబీఏ, ఎంసీజె, ఎం ఎస్ సి, (సైకాలజీ) వంటి ఉన్నత విద్యార్హతలతో పాటు కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్స్ రంగాల్లో మంచి పట్టు కలిగిన లింగమూర్తి తన వృత్తి జీవితంలో నిబద్ధత, క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నారు. ఆయన అందిస్తున్న వార్తలు ప్రజల్లో చైతన్యం కలిగించడమే కాకుండా, ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సామాజిక సమస్యలపై ఆయన చేసిన కథనాలు ప్రజల దృష్టిని ఆకర్షించడంలో ప్రత్యేక స్థానం సంపాదించాయి.ఈ అవార్డు స్వీకరణ సందర్భంగా రాంపెల్లి లింగమూర్తి మాట్లాడుతూ, "జాతీయ స్థాయి గౌరవం అందుకోవడం నా జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఇది నా కృషికి లభించిన గుర్తింపు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణగా నిలుస్తుంది. నిజాయితీ, నిష్పక్షపాత జర్నలిజం ద్వారా సమాజానికి సేవ చేయడం నా లక్ష్యం" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయనకు సహచర జర్నలిస్టులు, స్నేహితులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తికి ఇలాంటి జాతీయ స్థాయి గౌరవం లభించడం జిల్లా ప్రజలకు గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ అవార్డు ద్వారా యువ జర్నలిస్టులకు ప్రేరణ కలిగే అవకాశముందని తెలిపారు.

భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా మండల కార్యవర్గ సమావేశం..

పాలేరు ఏప్రిల్ 26(నినాదం): భారతీయ జనత పార్టీ దళిత మోర్చా మండల కార్యవర్గ సమావేశం దళిత మోర్చా మండల అధ్యక్షులు గుండెపోగు క్రాంతి అధ్యక్షతన జరిగిన సమావేశం కొత్త కొత్తూరు లో జరిగింది ఈ సమావేశానికి ముఖ్యం అతిధిగా బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ హాజరు కావటం జరిగింది ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతు భూమి లేని దళితులకు 3 ఎకరాల భూమి ఇవ్వాలని అదేవిదంగా బ్యాంక్ తో సంబంధం లేకుండా ఎస్సీ కార్పొరేషన్ ధ్వారా నిరుపేద దళితులకు 5లక్షలు ఋణం ఇవ్వాలని ప్రభుత్వం ని కోరారు, నిరుపేద ఇల్లు లేని దళితులకు ఇళ్ల స్థలం కేటాయించి ప్రభుత్వం ఇల్లు కేటాయించాలి దళితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వం ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, దళిత మోర్చా జిల్లా మాజీ అధ్యక్షులు సూరేపల్లి జ్ఞానరత్నం, కొదమగుండ స్వామి దాసు, టీ సతీష్, కే నాగరాజు, ం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గజల్ కవి కట్టెకోలకు ఘనసత్కారం
అభినందించిన విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్

ఖమ్మం ప్రతినిధి , ఏప్రిల్ 26:(నినాదం)
నగరానికి చెందిన ప్రముఖ గజల్ కవి, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యను విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ 5వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పి విజయలక్ష్మి పండిట్, బిక్కి కృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షికోత్సవంలో పలువురు ప్రముఖ గజల్ రచయితల పుస్తకాలను ఆవిష్కరించారు. గజల్ రచనలలో గానంలో ఆరితేరిన ప్రముఖ గజల్ గాయనీ గాయకులను, గజల్ రచనలలో ప్రతిభ కనపరిచిన గజల్ కవులను, కవయిత్రులను జాతీయ అవార్డులతో ఫౌండేషన్ సత్కరించింది. అందులో భాగంగా గజల్ కవి కట్టెకోల చిన నరసయ్యకు ఎన్టీఆర్ సాహిత్య కమిటీ చైర్మన్ టిడి జనార్దన్, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పి విజయలక్ష్మి పండిట్, బిక్కి కృష్ణ, ప్రముఖ కవయిత్రి, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమలు శాలువా కప్పి, ప్రశంసా పత్రాన్ని మెమెంటోలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు కట్టెకోలను అభినందించారు.

వడ్ల కొనుగోళ్లు ఆలస్యం కావడం వల్ల రైతులకు ఇబ్బందులు

సిద్దిపేట ఏప్రిల్ 26(నినాదం) వడ్ల కొనుగోళ్లు ఆలస్యం కావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, బీజేపీ నంగునూరు మండల ఉపాధ్యక్షుడు కత్తుల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం వారు సిద్దన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద విలేఖరులతో మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ కొనుగోలు ఆలస్యం అవుతోందని పేర్కొన్నారు. దీనివల్ల రోజుల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు పడుతున్నారని వాపోయారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో రైతులు ఎండ దెబ్బకు గురై అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. దీనికి తోడు వాతావరణ పరిస్థితులు మారి అకస్మాత్తుగా కురిసే ఆకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో నాణ్యమైన గన్ని సంచులు అందించడంతో పాటు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు సరిపడా టార్పాలిన్ కవర్లను ప్రభుత్వమే ఉచితంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు కనీసం మూడు వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు

నేలకొండపల్లిలో కన్యక పరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం

పాలేరు ఏప్రిల్ 26(నినాదం) వైశాఖ మాస శుక్లపక్షం దశమి ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మ దినోత్సవం సందర్భంగా నేలకొండపల్లి సత్య సాయి బాబా మందిరంలో ఆర్యవైశ్యులచే అభిషేకములు గోపూజ కుంకుమ పూజ అమ్మవారికి వడి బియ్యం పోయటం చిన్నపిల్లలని కన్యకలుగా అమ్మవారి రూపంలో వారికి తాంబూలం ఇవ్వటం కార్యక్రమాలు నిర్వహించటం జరిగినది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మ దినోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అధికారి కంగా ప్రకటించి జీవో అమలు చేయడం జరిగినది.మన తెలంగాణ రాష్ట్ర, ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి చిత్రపటానికి నేలకొండపల్లి పొట్టి శ్రీరాములు సెంటర్లో ఆర్య వైశ్యులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియ జేసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేట్ వైస్ ప్రెసిడెంట్ రేగూరి హనుమంతరావు ఆర్యవైశ్య సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్స్ రేగూరి వాసవి, డాక్టర్ నాగబండి శ్రీనివాసరావు, వాసవి క్లబ్స్ జిల్లా వైస్ గవర్నర్ కొత్తా రమేష్, రీజియన్ చైర్మన్, గోళ్ళ నరసింహారావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గల్లా కృష్ణారావు, జోన్ చైర్మన్ భువనగిరి రామసేసయ్య ఎర్ర నాగేశ్వరరావు వాసవి భవన అధ్యక్షులు మాటూరు సుబ్రహ్మణ్యం తెల్లాకుల అశోక్ అయ్యప్ప శీను ఈగ అనిల్ కుమార్ వాసవి క్లబ్ అధ్యక్షులు కార్యదర్శిలు కోశాధికారులు మరియు క్లబ్ సభ్యులు, మరియు జెర్రిపోతుల అంజని బొడ్డు నాగరాజు కొత్త కరుణ దోసపాటి ఉషారాణి తెల్లాకుల జయశ్రీ కొత్త శారద అత్తులూరి నాగలక్ష్మి దోసపాటి కల్పన, ఆర్యవైశ్యులు అందరు పాల్గొని విజయవంతం చేశారు..

లెంకాలపల్లిలో దాతృత్వానికి నిలువెత్తు నిదర్శనం
వాటర్ ప్లాంట్‌తో పాటు వైకుంఠ రథం విరాళం – ఎద్దు రాజు మమతలకు ఘన సన్మానం.

నల్లబెల్లి, ఏప్రిల్ 26 (నినాదం): వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లెంకాలపల్లి,గ్రామ అభివృద్ధి కోసం ముందుకొచ్చి సేవా భావాన్ని చాటుకున్న దాత ఎద్దు రాజు మమతలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటి కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వైకుంఠ రథం (టాటా ఏస్ వాహనం)ను విరాళంగా అందించడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి రవీందర్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని దాత సేవలను కొనియాడారు.
గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అంత్యక్రియల కోసం ఉపయోగపడే వైకుంఠ రథాన్ని అందించడం ద్వారా గ్రామానికి మరింత సేవ చేసినట్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబరావు, డీలర్ ఏరుకొండ సదానందం శాలువాలు కప్పి ఎద్దు రాజు మమతలను ఘనంగా సత్కరించారు. గ్రామ పాలకమండలి సభ్యులు, ఉపసర్పంచ్, మాజీ సర్పంచులు, ఇతర ప్రముఖులు ఆమె సేవలను ప్రశంసించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొలిపాక రఘుపతి, వార్డు సభ్యులు సింగిరెడ్డి రవి, జున్ను అనిత, నానబోయిన రజిత స్వామి, గాదం రాజమ్మ రమేష్, మాజీ సర్పంచ్ గన్నబోయిన చేరాలు, యూత్ లీడర్ మేకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధి కోసం ఇలాంటి దాతలు ముందుకు రావడం సంతోషకరమని, ఇది ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

32 సంవత్సరాల సరస్వతి శిశు మందిర్ పూర్వ విద్యార్థుల వేడుక

నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్ 26 (నినాదం): నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాగులవాడలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో పదవ తరగతి అభ్యసించి 32 సంవత్సరాలకు ఒకచోట చేరి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.. కొండాపూర్ లోని ఓ ఫంక్షన్ హాల్లో 120 మంది విద్యార్థులు 14 మంది ఆచార్యులు ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను అనుభవాలను పంచుకున్నారు. మరణించిన తోటి విద్యార్థుల పిల్లలకు చదువుకోవడానికి ఆర్థిక సాయం ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు రావుల సూర్యనారాయణ, ఆచార్యులు రామానుజాచార్యులు, ప్రసాద్ రావు, హరిబాబు,నయన, గోపాలాచార్యులు, సత్యనారాయణ, రాజేందర్, గంగాధర్, రాములు, నారాయణ, బాలయ్య, చంద్రశేఖర్, ముత్యంరెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మునుగోడు, ఏప్రిల్ 26 (నినాదం): మునుగోడు నియోజకవర్గం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల 2010--11 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 25-4-2026, శనివారం బి జే ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో, ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ దామోదర్ రెడ్డి , ఉపాధ్యాయులు నాగమ్మ, నాగభూషన్, అన్నపూర్ణ, సుజాత, యాదగిరి హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. చాలా కాలం తరువాత ఒకే వేదికపై కలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందభరిత క్షణాలను గడిపారు.విద్యార్థులు కట్టెల ఆనంద్, సుర్వి రాజేష్, యముడాల లింగస్వామి, సుర్వి సురేష్, బోయ వంశీ తేజ, జి.శివారెడ్డి,సుర్వి, మహేష్, జి.లింగస్వామి, వి.మహేష్ వై. శ్రీకాంత్, సమీరా, కవిత, సంతోష, అశ్విని, సునీత, సుష్మ, ధనమ్మ, లావణ్య తోపాటు సుమారు 60 మంది హాజరయ్యారు. వారు తమ విద్యా దశలో ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి ఘనంగా గౌరవించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ప్రేరణాత్మక సందేశాలు అందించారు. ఈ సమ్మేళనం ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధం మరింత బలపడింది.ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి
నిందితుడిపై కేసు నమోదు

నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 26 (నినాదం): విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై అకారణంగా దాడి చేసి, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై నల్గొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.నల్గొండ రూరల్ పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం అర్జాలబావి గ్రామ సమీపంలో గల ఐటీ హబ్ (ఐటీ హబ్) వద్ద ఆదివారం ఉదయం సుమారు 08:10 గంటల సమయంలో ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు డ్రైవర్ తల్లా రామ్ కుమార్ బస్సును నిర్దిత స్టాప్ వద్ద నిలిపారు. ఆ సమయంలో తన బ్రేక్‌పై (టీఎస్ -05- ఎఫ్ జె- 9301) వచ్చిన తుపాకుల వెంకటేశం అనే వ్యక్తి, బస్సును మధ్యలో ఎందుకు ఆపలేదని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు.బస్సును కేవలం నిర్దేశించిన స్థాపుల వద్దే ఆపుతామని డ్రైవర్ రామ్ కుమార్ చెప్పినప్పటికీ నిందితుడు వెంకటేశం డ్రైవర్‌ను అసభ్య పదజాలంతో దూషించాడు. అనంతరం బస్సులోకి ప్రవేశించి డ్రైవర్‌ను సీటులో నుండి కిందకు లాగి విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో డ్రైవర్ రామ్ కుమార్ కుడి కంటి పైన, మోకాలికి గాయాలయ్యాయి.ఈ నేపథ్యంలో బాధితుడు రామ్ కుమార్ ఫిర్యాదు మేరకు నల్గొండ రూరల్ ×. సైదా బాబు నిందితుడు తుపాకుల వెంకటేశంపై బిఎన్ఎస్ (దీచీ) సెక్షన్లు 118(1), 352 కింద కేసు (ఖీ×= చీశీ. 90/2026) నమోదు చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల విధినిర్వహణకు ఆటంకం కలిగిస్తూ వారిపై భౌతిక దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి హెచ్చరించారు. ఆర్టీసీ సిబ్బందికి అండగా ఉండి వారి రక్షనే తమధ్యేయ మని అన్నారు..

ఆలయాలను దర్శించుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి

సిద్దిపేట ఏప్రిల్ 26(నినాదం): సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో వంగ రాజేశ్వర్ రెడ్డి శ్రీ లంద ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చింత మడక గ్రామ ప్రజలందరికీ అమ్మవారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తాను ఎప్పుడూ ముందుండి పనిచేస్తానని హామీ ఇచ్చారు.

ఫ్లడ్ లైట్ వెలుతురులో ఎద్దుల బండ లాగు బాల ప్రదర్శన పోటీలు

హుజూర్ నగర్, ఏప్రిల్ 26 (నినాదం): మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయం మేరీమాత పుణ్యక్షేత్రం తిరుణాల సందర్భంగా శుభోదయ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ తెలుగు రాష్ట్రాల ఎద్దుల బండలాగు బల ప్రదర్శన పోటీలు వివి హై స్కూల్ ప్రాంగణంలో ఆదివారం రెవరెండ్ ఫాదర్ పోగుల రాజారెడ్డి, ఫాదర్ అశోక్, శుభోదయం యువజన సంఘం అధ్యక్షులు గాదే జయ భారత్ రెడ్డి, మౌంట్ ఫోర్ స్కూల్ హెచ్ఎం బ్రదర్ వినోద్ రెడ్డి, సిస్టర్ రూబీ, శుభోదయం యువజన సంఘ సభ్యులు ప్రారంభించారు.

సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా ముకుంద రెడ్డి

అల్వాల్, ఏప్రిల్ 26 (నినాదం): సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ గా జీ. ముకుంద రెడ్డి నేడు బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత స్పెషల్ కమిషనర్ గా ఉన్న సిహెచ్ ప్రియాంకను బదిలీ చేయడంతో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ గా ఉన్న ముకుంద రెడ్డిని సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నేడు సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ తో పాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా కూడా ముకుంద రెడ్డి బాధ్యతలను స్వీకరించారు.

తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా
కేసీఆర్ నిలుస్తారు
ఊరూరా వాడవాడనా గులాబీ జెండాలను ఆవిష్కరించాలి. మాజీ మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం, ఏప్రిల్ 26(నినాదం): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం(ఏప్రిల్ 27వ తేదీ) పురస్కరించుకుని ప్రతి గ్రామంలో మున్సిపల్ వార్డు, డివిజన్లలో పార్టీ జెండాలను ఎగురవేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆనాడు శిథిలమైన తెలంగాణకు ఊపిరినివ్వడానికి ఎన్నో అవమానాలు, బెదిరింపులు, ఛీత్కారాలు, కేసులు ఎదుర్కొని నిలబడి పోరాడి తెలంగాణ రాష్ట్ర సాకారమే లక్ష్యంగా కేసీఆర్ ముందుకు సాగారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ భాగస్వాములు కావాలని పువ్వాడ సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్ చేసిన కేసీఆర్ పేరు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు

మంత్రి ఒంటెద్దు పోకడలు నచ్చక సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల రహస్య సమావేశం?
పార్టీ జెండా మోసిన వారికి ప్రాధాన్యత కరువు...

చెన్నూర్ ఏప్రిల్ 26(నినాదం): మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి ఒంటెద్దు పోకడలు నచ్చక రహస్య సమావేశం ఏర్పరచుకొని పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం కొత్తగా బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో వలస వచ్చి చేరిన కొత్తతవా పదవులు మరియు వారికి ప్రాధాన్యతనిస్తూ పద్మళ్లు పార్టీ జెండా మోసిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పట్టించుకోక పోవడంతో సీనియర్ నాయకులు అసంతృప్తితో పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం ఇకనైనా మంత్రి పట్టించుకోక పోతే రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని పట్టణం విశ్లేషకులు చెప్తున్నారు...

మహిళను వేధించిన
వ్యక్తిపై కేసు నమోదు

జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 25 నినాదం: భర్త ఉపాధి కోసం గల్ఫ్ లో ఉండగా ఇద్దరు పిల్లలతో గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఒంటరి మహిళను ఇంటి పక్కనే ఉన్న ఒక వ్యక్తి తరచూ వేధిస్తున్న వ్యక్తిపై పోలీసు కేసు నమోదు చేశారు బాధితురాలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల మండలం బాలపల్లి గ్రామానికి చెందిన గుంటి రజని జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో గుంటి సతీష్ పై ఫిర్యాదు చేసింది. ఇంటి పక్కనే ఉన్న సతీష్ తన ఇంటిపై ఉన్న రేకులను ధ్వంసం చేయడం, దారికి అడ్డంగా రాళ్లు పెట్టడం లాంటివి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రజని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు రూరల్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టి గుంటి సతీష్ అనే వ్యక్తిపై సెక్షన్ 329 (3) 324(3) 351 (2) 292బి ఎన్ కింద కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సదరు మహిళ ను ఇబ్బంది పెట్టకుండా కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు వివరాలు వెల్లడించారు.

మే డే ను జయప్రదం చేయండి – ఏఐటీయూసీ పిలుపు
పుల్కల్‌లో గోడపత్రిక ఆవిష్కరణ..
కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడాలి

సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 26(నినాదం): కార్మిక వర్గ పోరాట స్ఫూర్తిని చాటుతూ 141వ మే డే వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం పిలుపునిచ్చింది. ఆదివారం పుల్కల్ మండల కేంద్రంలో మే డే గోడపత్రికను సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.ఏ. రెహమాన్, వెంకట్రాజ్యం మాట్లాడుతూ, చికాగో కార్మికుల రక్తతర్పణంతో ఏర్పడిన ఎర్రజెండా నేటికీ కార్మిక హక్కుల రక్షణకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు కష్టపడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. దీనివల్ల పనిగంటలు 12 గంటలకు పెరుగుతాయని, సమ్మె చేసే హక్కు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న కేంద్ర వైఖరిని ఎండగట్టాలని, మే డే స్ఫూర్తితో కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు శివశంకర్, నాయకులు విజయకుమార్, దుర్గారావు, రాములు, రాజు, భూమయ్య, సజీద్, పద్మారావు, మల్లేశం, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.